రేపు బతుకమ్మ వేడుకలు

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయం వద్ద ఈనెల 9వ తేదీన బతుకమ్మ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి తెలిపారు. సోమవారం బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి మాట్లాడుతూ.. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 6 గంటల నుండి బతుకమ్మ వేడుకలు జరుగుతాయని చెప్పారు. సమావేశంలో పార్టీ నాయకులు హనుమంతరావు, అశోక్‌యాదవ్,కట్టు బలరాం,కూతురు నర్సింహ,వనం శ్రీనివాస్,లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్యే తలసాని


డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలసాని

బన్సీలాల్‌పేట్: ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. బన్సీలాల్‌పేట్ డివిజన్ గొల్లకొమురయ్య కాలనీ ప్రధాన రహదారిలో జరుగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ కె. హేమలత, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గం సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య, జల మండలి జీఎం వినోద్‌కుమార్, ఈఈ సుదర్శన్‌లతో పాటు స్థానిక నాయకులు పలువురు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

సనత్‌నగర్: ప్రజా సమస్యల పరిష్కారానికే తన మొదటి ప్రాధాన్యత అని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ స్పష్టం చేశారు. సోమవారం సనత్‌నగర్‌లోని జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మారేడ్‌పల్లిలోని కార్యాలయంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసి పలు సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జెక్‌కాలనీలో అనేక అభివృద్ధి పనులు చేపట్టి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో టీఆర్‌ఎస్ నేత కొలను బాల్‌రెడ్డి, జెక్‌కాలనీ అధ్యక్షుడు మల్లు ప్రసాద్, జనరల్ సెక్రటరీ రాజశేఖర్ చందు, అనంతరెడ్డి, సుబ్బరాజు, సురేష్‌గౌడ్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా నవరాత్రి ఉత్సవాలు

పద్మారావునగర్: పద్మారావునగర్ పోల్‌బాల్ హనుమాన్ దేవాలయం, సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రి ఎదురుగా ఉన్న శ్రీ జ్ఞాన సరస్వతీ దేవాలయం, బన్సీలాల్‌పేట్‌లోని నల్లపోచమ్మ, రేణుకా ఎల్లమ్మ దేవాలయాలు, గాంధీనగర్, బోలక్‌పూర్, మోండా మార్కెట్, రాణిగంజ్, బండమైసమ్మ నగర్, హైదర్‌బస్తీ తదితర ప్రాంతాల్లో దేవీ నవరాత్రోత్సవాలు కన్నుల పండువగా జరుగుతున్నాయి. పద్మారావునగర్ పోల్‌బాల్ హనుమాన్ దేవాలయాన్ని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా బీజేపీ నాయకులు మర్రి పురురవరెడ్డి కూడా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం కమిటీ ప్రతినిధి రాజేష్ గౌడ్‌తో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఏసూరి మహేష్, లక్ష్మీపతి, కుమార్ యాదవ్, వెంకటరమణ, సురేష్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పా సెంటర్‌లో పోలీసుల సోదాలు

అమీర్‌పేట: నిబంధనలు పాటించకుండా స్పాసెంటర్ నిర్వహిస్తున్న నిర్వాహకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఆర్ నగర్ స్వస్తిక్ ప్లాజా హిమాలయ బిల్డింగ్‌లో కొడాలి అనిల్‌కుమార్ ఏఎస్ రూబీ ప్లాజా పేరుతో స్పా సెంటర్ నడుపుతున్నాడు. సోమవారం వెస్టుజోన్ టాస్క్ ఫోర్సు పోలీసులు సోదాలు నిర్వహించారు. ఈ సమయంలో స్పాలో ఓ కస్టమర్‌తో పాటు నలుగురు మహిళా థెరపిస్టులు ఉన్నారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా స్పా నిర్వహిస్తున్న అనిల్‌కుమార్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు.

బంగారు మైసమ్మ ఆలయ అభివృద్ధికి కృషి


మేడిబావి కనకదుర్గ ఆలయంలో అన్నప్రసాద వితరణ చేస్తున్న ఆలయ చైర్మన్ పరికిబండ కళాప్రకాశ్ తదితరులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌లోని శ్రీబంగారు మైసమ్మ దేవాలయ అభివృద్ధికి తకవంతు సహకారం అందిస్తామని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ హామీ ఇచ్చారు. బంగారు మైసమ్మ అమ్మవారు లలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి సోమవారం నిర్వహించిన ప్రత్యేక పూజలకు తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.

ఓబీసీ వర్కింగ్ చైర్మన్‌గా వీరన్న

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఓబీసీ వర్కింగ్ చైర్మన్‌గా మేకల వీరన్నయాదవ్ నియమితులయ్యారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జాతీయ విభాగం చైర్మన్ కెప్టెన్ అజయ్‌సింగ్ యాదవ్ చేతుల మీదుగ నియమకపు పత్రాన్ని అందుకున్నట్లు వీరన్న తెలిపారు.

24న పీడీఎస్‌యూ అర్ధశాతాబ్ది ఉత్సవాలు

ఉస్మానియా యూనివర్సిటీ: పీడీఎస్‌యూ ఆవిర్భవించి 50 ఏళ్లు అయిన సందర్భంగా అర్ధశతాబ్ది ఉత్సవాల సభను ఓయూలో నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు మహేష్ సోమవారం తెలిపారు. ఈ నెల 24న వర్సిటీ కార్యంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.63, నల్లవంకాయ 40, పొడుగు వంకాయ 28, బెండకాయ 40, పచ్చిమిర్చి 28, బజ్జీమిర్చి 70, క్యాప్సికమ్ 70, పచ్చకాకర 38, పందిరి బీర 50, క్యాబేజీ 21, క్యారెట్ 43, దొండ 45, గుండుబీన్స్ 95, గింజ చిక్కుడు 60, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 28, బీట్‌రూట్ 25, ఉల్లిగడ్డ 45, ఆలుగడ్డ 37, చామగడ్డ 37, మొరంగడ్డ 35, కందగడ్డ 35, సొరకాయ 17, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 5-6, ముల్లంగి 5-6. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

ఎటుచూసినా ఆధ్యాత్మిక సందడి


మహాలక్ష్మిగా రాజరాజేశ్వరీ అమ్మవారు


భవానీదేవిగా ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు


గౌరీదేవిగా బేగంపేట ప్రకాష్‌నగర్ భూలక్ష్మీ అమ్మవారు


శ్రీలలితాదేవి అలంకారంలో సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం కనకదుర్గాదేవి..

సనత్‌నగర్: ఒకచోట సంప్రదాయ కూచిపూడి నృత్యఝురి..ఇంకోచోట దాండియా సందడి..మరోచోట కోలాటాల హంగామా..వెరసి వాడవాడలా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు కన్నులపండువగా కొనసాగుతున్నాయి. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిక్కిరిసి సందడిగా మారాయి. పలు దేవాలయాల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరిస్తున్నాయి. అమ్మవారు రోజుకొక అలంకారంతో దర్శనమిస్తూ కనువిందు చేస్తున్నారు.

- సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా కనకదుర్గాదేవి అమ్మవారు సోమవా రం శ్రీలలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి సత్యనారాయణ ఆధ్వర్యంలో అర్చకులు సుదర్శనాచార్యులచే ప్రత్యేక పూజలు జరిగాయి.
- బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని భూలక్ష్మి అమ్మవారు సోమవారం గౌరీదేవిగా దర్శనమిచ్చారు.

భవానీదేవిగా ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారు సోమవారం భవానీదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

మహాలక్ష్మిగా రాజరాజేశ్వరీదేవి

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీదేవి అమ్మవారు సోమవారం మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు.


రాజరాజేశ్వరీదేవి అలయంలో పూజలు చేస్తున్న భక్తులు

వర్గీకరణ చేసే వరకు ఉద్యోగ నియామకాలను చేపట్టొద్దు


కుమార్ షాను

లాలాపేట: ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపడుతూ మాదిగలను మోసం చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి వచ్చే స్థానిక సంస్థలు, జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తామని బహుజన నాయకులు, స్వేరోస్ నగర కార్యదర్శి కుమార్ షాను అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేసుకునే వెసులుబాటును రాష్ట్రాలకు అప్పగిస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకపోవడం దారుణం అన్నారు. ఈ తీర్పు తరువాతనే అనేక ఉద్యోగ నియామకాలకు పరీక్షలు జరిగిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

నేడు ప్రసన్న వెంకన్నస్వామి కల్యాణోత్సవం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస నగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ 47వ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం ఉదయం 9.30 గంటలకు పద్మావతి గోదా సమేత వెంకన్నస్వామి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఈఓ రాజేష్‌కుమార్, అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణుగోపాలరావులు తెలిపారు. బ్రహోత్సవాలలో ఐదవ రోజైన సోమవారం అభిషేకం, చక్రస్నానం, వేద పారాయణం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారు హనుమంతు వాహన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం కల్యాణోత్సవం, గరుడవాహన సేవలు నిర్వహించనున్నారు. ఆధ్యాత్మికవేత్తలు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరై బ్రహ్మోత్సవాలతోపాటు శ్రీవారి కల్యాణాన్ని కనులారా వీక్షించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బాలభాస్కర్, లక్ష్మీనారాయణ, ఆత్మరామసూర్య సుబ్రహ్మణ్యం, నారాయణన్, శివశంకరన్, షన్ముఖరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


హనుమంతు వాహన అలంకరణలో వెంకన్నస్వామి

చురుగ్గా సర్వే

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం వివరాల సేకరణ

- పైలెట్ ప్రాజెక్టు కింద అమీర్‌పేట్ సైంటిఫిక్ కాలనీ ఎంపిక

సనత్‌నగర్/బన్సీలాల్‌పేట్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు నేరుగా అందించడానికి వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ విభాగాలకు చెందిన అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రజల నుంచి వివరాలు సేకరించి ఫ్యామిలీ డిజిటల్ కార్డులను అందజేస్తారు. ఈ ప్రాజెక్టును ఇటీవల సికింద్రాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఓ కాలనీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అమీర్‌పేట్ డివిజన్ సైంటిఫిక్ కాలనీని ఇందు కోసం అధికారులు ఎంపిక చేశారు. ఈ కాలనీలో నివసించే ప్రతి ఒక్క కుటుంబానికి డిజిటల్ కార్డులను అందజేస్తారు. అధికారుల బృందం సైంటిఫిక్ కాలనీలో పర్యటించి ప్రజల నుంచి వివరాలు తీసుకుంటారు. అనంతరం కార్డులను జారీ చేస్తారు.

సర్వేకు ప్రజలు సహకరించాలి



ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం నిర్వహించే సర్వేకు ప్రజలు సహకరించాలని జీహెచ్‌ఎంసీ బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సర్వే సందర్భంగా సైంటిఫిక్ కాలనీకి వచ్చే సిబ్బందికి ప్రజలు కుటుంబ వివరాలు తెలియజేసి సహకరించాలని కోరారు. పైలెట్ ప్రాజెక్టు కింద ముందుగా ప్రభుత్వం సైంటిఫిక్ కాలనీని గుర్తించిందన్నారు. – డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య

మూడు బృందాలతో సర్వే ఇలా.....

సనత్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని అమీర్‌పేట్ సైంటిఫిక్ కాలనీలో మూడు బృందాలు సర్వే నిర్వహించనున్నాయి. ఇంటింటికి వెళ్లి అధికారులు కుటుంబరాలు తీసుకొని డిజిటల్ కార్డులో నిక్షిప్తం చేస్తారు. ప్రతి రోజూ సుమారు 30 నుంచి 40 కుటుంబాలకు సంబంధించిన వివరాలు తీసుకుంటారు. సంక్షేమ పథకాల దరఖాస్తుకు ఆధార్, పాన్, ఇతర కార్డులు లేకున్నా అధికారులు జారీ చేసే డిజిటల్ కార్డుతో దరఖాస్తు చేసుకోవచ్చు.

ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మల్లూరి


మల్లూరి అనీల్‌కుమార్

చిలకలగూడ: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సికింద్రాబాద్‌కు చెందిన మల్లూరి అనీల్‌కుమార్ నియమితులయ్యారు. ఈమేరకు ఫోరం చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ సోమవారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవం, సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని, తనకు పదవీబాధ్యతలు అప్పగించిన ఫోరం చైర్మన్ శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఓయూ స్నాతకోత్సవం రద్దు?

ఉస్మానియా యూనివర్సిటీ: ఈ విద్యా సంవత్సరం ఓయూ స్నాతకోత్సవం నిలిచిపోయింది. రెగ్యులర్ వీసీ లేకపోవడం వల్ల ఈ సారి స్నాతకోత్సవం రద్దయినట్లు తెలిసింది. ఈ ఏడాది సుమారు 800 మంది పీహెచ్‌డీ విద్యార్థులు డాక్టరేట్లు పూర్తి చేసి పట్టాలు అందుకోవాలనే ఆశతో స్నాతకోత్సవం కోసం ఎదురు చూస్తున్నారు. అయితే స్నాతకోత్సవం లేదని తెలుసుకున్న విద్యార్థులు నిరాశచెందుతున్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థుల పెండింగ్ స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల యజమానుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈరబోయిన నర్సింహయాదవ్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లక్షల రూపాయల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ వలన కాలేజీల భవనాల అద్దె, టీచింగ్, నాన్‌టీచింగ్ వేతనాలను చెల్లించలేక పోతున్నామన్నారు. దసరా సందర్భంగా అప్పులు చేసి వేతనాలు చెల్లిస్తున్నట్లు చెప్పారు.

యూజీసీ న్యాక్ గుర్తింపులోనే ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ: యూజీసీ న్యాక్ ఎ ప్లస్ గుర్తింపులోనే ఓయూ కొనసాగుతుందని ఐఏక్యూసీ డైరెక్టర్ ప్రొ.శిరీష సోమవారం తెలిపారు. న్యాక్ గుర్తింపు పై సందేహాలు అవసరంలేదన్నారు. ఏడు సంవత్సరాల క్రితం లభించిన యూజీసీ న్యాక్ ఎ ప్లస్ గుర్తింపు గత నెల 24తో ముగిసింది. కానీ గత ఏప్రిల్ నెల నుంచి నాటి వీసీ ప్రొ.రవీందర్ సమక్షంలో న్యాక్ గుర్తింపునకు పని ప్రారంభించిన్నట్లు తెలిపారు. మరో మారు న్యాక్ గుర్తింపునకు సెల్ఫ్ స్టడీ రిపోర్టు (ఎస్ఎస్ఆర్) ముగిసి స్టూడెంట్స్ స్టడీస్ సర్వే జరుగుతుంది. మరో రెండు నెలల్లో న్యాక్ గుర్తింపు పై యూజీసీ నుంచి స్పష్టత రానున్నట్లు డైరెక్టర్ చెప్పారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

అమీర్‌పేట: తెలంగాణ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ టీకే శ్రీదేవి బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకున్నారు. సోమవారం ఆలయానికి విచ్చేసిన ఆమెకు అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేద మంత్రాలతో ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఆమె వెంట ఆలయ ఈఓ కృష్ణ ఉన్నారు.


అమ్మవారిని దర్శించుకున్న ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీదేవి

ఆకట్టుకున్న దాండియా నృత్యం



లాలాపేట: బతుకమ్మ, దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురష్కరించుకుని సీఎస్ఆర్ మెమోరియల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తార్నాకలోని మర్రి కృష్ణా హాల్లో నిర్వహించిన దాండియా నైట్స్ ఎంతగానో ఆకట్టుకుంది. స్థానిక యువతులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.




అడ్డగుట్ట డివిజన్ లోహియానగర్‌లో జాంబవంతి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేస్తున్న స్థానికులు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించిన నేతలు

లాలాపేట: సికింద్రాబాద్ నియోజక వర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకులు లీగల్ సెల్ వైస్ చైర్మెన్ ఎల్ ఎల్ బి శ్రీనివాసులు గౌడ్ ఆధ్వర్యంలో పలువురు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని పరామర్శించారు. ఇటీవల మంత్రి ఉత్తమ్ తండ్రి మృతి చెందడంతో నియోజక వర్గం నాయకులు నివాసంలో సోమవారం కలిసారు. సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి తండ్రి పురుషోత్తంరెడ్డి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు.


ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తండ్రి పురుషోత్తంరెడ్డి చిత్రపటం వద్ద శ్రద్ధాంజలి ఘటిస్తున్న నేతలు

చురుగ్గా బీజేపీ సభ్యత్వ నమోదు

లాలాపేట: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో గత కొన్ని రోజుల నుంచి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జోరుగా నిర్వహిస్తున్నారు. సోమవారం తార్నాక చౌరస్తాలో ఎస్టీ మోర్చ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామ్‌చందర్‌రావు ముఖ్యతిధిగా పాల్గొని సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు.


తార్నాకలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావు

తార్నాకలో కారు బీభత్సం..



లాలాపేట: తార్నాక స్ట్రీట్ నెంబర్ 1లో సోమవారం ఓ కారు బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. సోమవారం సాయంత్రం మారుతీ కారు డ్రైవర్ అతివేగంగా వచ్చి రోడ్డుపై నడుచుకుంటూ వెళుతున్న ఓ సెక్యూరిటీ గార్డును ఢీ కొట్టి, చెట్టుకు ఢీ కొట్టి, చివరికి ఐఐసిటీ ప్రహరీ గోడను ఢీ కొట్టి ఆగిపోయాడు. ఈ ప్రమాద దాటికి రోడ్డంతా హల్‌చల్ అయ్యింది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి కాలుకు తీవ్ర గాయం అయ్యింది. కారు డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయాడు. గాయపడ్డ వ్యక్తిని స్థానికులు చికిత్స నిమిత్తం హాస్పిటల్‌కు తరలించారు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరిస్తున్నారు.

అసంఘటిత కార్మికుల కమిటీ అధ్యక్షుడిగా రాజుసాగర్

అడ్డగుట్ట: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అఖిల భారత అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల కమిటీ సికింద్రాబాద్ జిల్లా చైర్మన్‌గా అడ్డగుట్టకు చెందిన గంట రాజుసాగర్ నియామితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర చైర్మన్ కౌసీల్ సమీర్ చేతుల మీదుగా సోమవారం నియామకపత్రాన్ని అందుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాయిస్ చైర్మన్ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, భూపతి హరి, కృష్ణారావు, నవీన్‌కుమార్, సాయిచందర్, ప్రభుదేవ్ తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాన్ని అందుకుంటున్న రాజుసాగర్

ఉత్సాహంగా బతుకమ్మ వేడుకలు


అడ్డగుట్ట ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ వేడుకలు

అడ్డగుట్ట: అడ్డగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆశా వర్కర్లు తీరొక్క పూలతో అందమైన బతుకమ్మలను తయారు చేసుకొచ్చారు. అనంతరం, ఆటపాటల నడుమ బతుకమ్మ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ జయశ్రీ, డాక్టర్ వీరు కాసర్ల తదితరులు పాల్గొన్నారు.